

పేపర్ లీకేజీ కాదు.. వ్యాపారం
ఏడెనిమిది నెలల నుంచి టీఎస్‌పీఎస్సీ పేపర్లు బయటకు పోతున్నాయంటే అది లీకేజీ కాదని, వ్యాపారం అని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. - 8లో▸



బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం
బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు ఆయా సబ్జెక్టుల పరీక్షలు మళ్లీ రాసుకునేందుకు కేయూ అధికారులు అవకాశం కల్పించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$37.6^0/24.2^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

ఇఫ్తార్	సహర్
సోమ 6:35	మంగళ 4:51

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేడు బయ్యారం ప్రజావాణికి కలెక్టర్ రాక

బయ్యారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ శశాంక హాజరుకానున్నారు. కలెక్టర్‌తో పాటు మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని పలుశాఖల అధికారులు సైతం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభం కానున్న ప్రజావాణి 12.30 గంటలకు ముగియనుంది.

వెండి బహూకరణ



గార్ల: మండలంలోని మర్రిగూడెం వేంకటేశ్వర స్వామికి రూ.లక్ష విలువ గల కిలోన్నర వెండిని గార్లకు చెందిన పుల్లఖండం వేణుగోపాల్‌రావు ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. దేవాలయంలో వెండి వాకిలి నిర్మాణం కోసం కిలోన్నర వెండిని బహూకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్లఖండం రమేష్‌బాబు, శ్రీనివాస్‌గుప్త, సతీష్‌కుమార్, అత్తులూరి సత్యనారాయణ, కనకశేఖరం, కామేష్, అర్చకులు అచ్యుత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం

మహబూబాబాద్ అర్బన్: ఇండియా స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజింగ్ (ఐఎస్ఆర్ఓ) ఆధ్వర్యంలో ఇస్రో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం-2023 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈఓ రామారావు, జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు ఆదివారం తెలిపారు. ఈ శిక్షణ మే 15నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని, 9వ తరగతి చదువుతున్న అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శిక్షణలో పాల్గొనాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్ఓ.గౌట్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 3వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 10వ తేదీన ఎంపికైన విద్యార్థుల వివరాలు తెలియజేస్తామని, ఈ శిక్షణ ఐఐఆర్ఎస్, ఎస్‌డీఎస్‌సీ శ్రీహరికోట, తిరువనంతపురం, అహ్మదాబాద్, హైదరాబాద్, షిల్లాంగ్‌లో నిర్వహిస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనాలని, వివరాలకు 98495 98281 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మానుకోట ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

మహబూబాబాద్ రూరల్: మానుకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఏఎంసీ ఆవరణలో నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్‌గా కత్తెరశాల విద్యాసాగర్, వైస్ చైర్మన్‌గా గుండా రాజశేఖర్, డైరెక్టర్లుగా కత్తుల ఎలేందర్, ధరావత్ బాలు, సామ బిక్షం, కందుల నరేష్, బొంత వెంకన్న, చెన్నబోయిన ఆంజనేయులు, భూక్యా సరియా, ముక్కల వెంకన్న, కలకోట రాము, గార్లపాటి భరద్వాజ్‌రెడ్డి, పావుశెట్టి సాంబశివరావు, గార్లపాటి మహిపాల్‌రెడ్డి, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్‌తో డీఎంఓ వెంకట్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్‌పాషా, డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, జెడ్పీటీసీ కమలరామనాథం, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్, రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిట్‌కు హీరో కిరణ్ అబ్బవరం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌కు 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్, సినీ హీరో కిరణ్ అబ్బవరం సోమవారం స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకల్లో భాగంగా రానున్నారు. స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వని ఫిల్మ్ కమిటీ ఆధ్వర్యంలో సినీ హీరో కిరణ్ అబ్బవరం నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో విద్యార్థులతో తన 'మీటర్' సినిమా విశేషాలను చిత్ర యూనిట్‌తో కలిసి ముచ్చటించనున్నారు.

వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు



'పది'లో ప్రణాళికే కీలకం

ఈ ఏడాది ఆరు పేపర్లు
- ఏప్రిల్ 3నుంచి వార్షిక పరీక్షలు
- అన్ని సబ్జెక్టుల్లో సాధన ముఖ్యం
- చక్కటి రాతతో ఉత్తమ మార్కులు
- ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు

మహబూబాబాద్ అర్బన్: ప్రతి విద్యార్థికి జీవితంలో అత్యంత కీలక దశ, టర్నింగ్ పాయింట్ పదో తరగతి. ఇక్కడ మంచి మార్కులు సాధిస్తే మరింత ఆత్మవిశ్వాసంతో ఉన్నత చదువులు చదవవచ్చు. భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలిచే అవకాశం ఉంది. కాగా ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు మొదటిసారిగా ఆరు పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. సిలబస్ మాత్రం పూర్తిగా చదవాల్సి ఉండగా రాయాల్సిన పరీక్షల సంఖ్య మాత్రం తగ్గింది. కొత్త విధానాన్ని అవగాహన చేసుకొని ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విషయ నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా, జిల్లాలో 8,461మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పలు సలహాలు, సూచనలు చేశారు.

తప్పులు లేకుండా చూసుకోవాలి



భాషాంశాలు, వ్యాకరణాంశాలను ఆయా పాఠ్యాంశాల వారీగా విభజించుకొని ఎక్కువ సార్లు రాస్తూ చదవాలి. కవి పరిచయాలు చదివి క్షుణంగా గుర్తుంచుకోవాలి. పద్యాలు, భావాలను ఎక్కువ సాధన చేయాలి. పాఠ్యాంశంపై పట్టు సాధిస్తే 12మార్కులు సాధించవచ్చు. వ్యాకరణంలో సంధులు, సమాసాలు, అలంకారాలు, చందస్సు అర్థాలపై అవగాహన పెంచుకుంటే అధిక మార్కులు సాధించే అవకాశం ఉంది.

- బి.వెంకన్న, తెలుగు ఉపాధ్యాయుడు

హిందీని అర్థం చేసుకొని జవాబులు రాయాలి



హిందీ పార్ట్-ఏలో60 మార్కులు ఉంటాయి. పేరాగ్రాఫ్‌కు 20మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలు అర్థం చేసుకొని సమాధానాలు రాస్తే సరిపోతుంది. లేఖ, రచన, వ్యాసాలు వంటి అంశాలను ప్రాక్టిస్ చేయాలి. పార్ట్-బీలో వ్యాకరణాంశాలు ఉంటాయి. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఎక్కువ మార్కులు వస్తాయి.

- టి.పద్మావతి. హిందీ ఉపాధ్యాయురాలు

చిన్న ప్రశ్నలకు సమాధానాలు రాస్తేనే మంచి మార్కులు



సాంఘిక శాస్త్రంలో ప్రపంచ, దేశ, రాష్ట్ర మ్యాప్‌లు గీయడం సాధన చేయాలి. పుస్తకంలోని ప్రతి పాఠ్యాంశంలోని పట్టికలు, గ్రాఫ్‌లు, చార్ట్స్, ప్రతి ప్రశ్నను క్షుణ్ణంగాచదివి పరీక్ష రాయాలి. చిన్న ప్రశ్నలను వదలకుండా రాయాలి. అప్పుడే మంచి మార్కులు సాధించవచ్చు.

- కె.వసంత, సోషల్ టీచర్

గణితమంటే భయం వీడాలి



గతంలో గణితం సబ్జెక్టులో రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు ఒక్క పేపర్ మాత్రమే ఉంటుంది. సమయం తక్కువ ఉన్నందుకు అభ్యాస పుస్తకంలోని ఎంపిక చేసిన ప్రశ్నల సమాధానాలు మాత్రమే చదివితే చాలు. గణితంలో బిట్స్‌కు 20మార్కులు ఉన్నందుకు ప్రతి చాప్టర్ చదవాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రంలోని అంశాలను ప్రాక్టిస్ చేయాలి. గణితమంటే భయం వీడాలి.

- శ్రీవాణి, మ్యాథ్స్ టీచర్

ఒత్తిడికి గురికావొద్దు



గతంలో భౌతిక, జీవశాస్త్ర పరీక్షలు రెండు రోజులు జరిగేవి. ప్రస్తుతం ఒక్క రోజే రెండు పరీక్షలు నిర్వహిస్తారు. మొదటి గంటన్నర భౌతికశాస్త్రం, తర్వాతి గంటన్నర జీవశాస్త్రం పరీక్ష ఉంటుంది. అన్ని పాఠ్యాంశాల్లో ఉన్న ప్రయోగాలు, పట్టికలు, పటాలు క్షుణ్ణంగా చదవాలి. ప్రయోగాల గురించి చదివేటప్పుడు ప్రయోగ విధానం, కావాల్సిన సామగ్రి, పరిశీలన, జాగ్రత్తలు తప్పక చదవాలి. పటాలు, వాటి భాగాలు సాధన చేస్తే సులువుగా ఐదు మార్కులు వస్తాయి.

- కె. వాసుదేవ్, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు

అక్షర దోషాలు ఉండొద్దు



ఏ-గ్రూప్ నుంచి సంభాషణ (కన్వర్జేషన్), డిస్క్రిప్షన్ (వివరణ) కొరియోగ్రఫీ, గ్రూప్-బీ నుంచి లెటర్, బయోగ్రాఫికల్ స్కెచ్, రిపోర్ట్ రైటింగ్ నుంచి ప్రశ్నలు ఎక్కువగా వస్తాయి. పాఠ్యపుస్తకంలో ఏ.బీ, సీ రీడింగ్ ప్యాసెజెస్‌పై పూర్తి అవగాహన ఉండాలి. అర్థం చేసుకొని మార్కులు సాధించాలి. క్వశ్చన్ ట్యాగ్, వాయిస్, రిపోర్టెడ్ స్పీచ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా చదువుతూ సాధన చేస్తే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. అక్షర దోషాలు ఉండొద్దు. రాతకూడా బాగుండాలి.

- శ్యామలాదేవి, ఇంగ్లిష్ టీచర్

ఏకరూపం.. ఇక విభిన్నం!

ముందుగానే చేరుకున్న యూనిఫామ్ క్లాత్

- ఎంఆర్సీ సెంటర్ల నుంచి హెచ్‌ఎంలు తీసుకెళ్లాలి
- లోకల్‌గా కుట్టించే బాధ్యత హెచ్‌ఎంలదే..
- కుట్టు కూలి దర్జీలకు ఒక్కో జతకు రూ.50
- ఉమ్మడి జిల్లాలో 2,17,799 మంది విద్యార్థులు
- స్కూళ్లు రీఓపెన్ కాగానే.. విద్యార్థులకు అందజేత



జిల్లాల వారీగా విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
హనుమకొండ	39,445
వరంగల్	43,948
జనగామ	35,905
ములుగు	21,439
జయశంకర్	22,874
మహబూబాబాద్	54,188
మొత్తం	2,17,799

విద్యారణ్యపురి: గత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందించడంలో జాప్యం జరిగింది. ప్రభుత్వం సైతం విమర్శలు ఎదుర్కొంది. అయితే వచ్చే విద్యా సంవత్సరానికి (2023-24) సంబంధించి పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ప్రభుత్వం ముందుగానే క్లాత్‌ను పంపింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల ఎంఆర్సీలకు క్లాత్ చేరుకుంది. అక్కడ్నుంచి పాఠశాలల్లోని హెచ్‌ఎంలు తమ స్కూల్ పాయింట్లకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. లోకల్‌గా దర్జీలతో విద్యార్థులకు కొలతలు ఇప్పించి రెండు జతల స్కూల్ యూనిఫామ్స్‌ను కుట్టించాల్సి ఉంటుంది. ఈమేరకు హెచ్‌ఎంలు క్లాత్‌ను తీసుకెళ్లిన 15 రోజుల్లో యూనిఫామ్స్‌ని కుట్టించి ఇవ్వాల్సిందిగా హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగించారు.

జూన్‌లో అందజేత!

ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కేజీబీవీలు, టీఎస్ఆర్ఐఎస్ఈ మోడల్ స్కూల్స్, యూఆర్ఎస్‌లలో 1 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందజేస్తారు. ఆశ్రమ పాఠశాలల్లో మాత్రం ప్రాథమిక స్థాయి విద్యార్థుల వరకు స్కూల్ యూనిఫామ్స్‌ను అందజేస్తారు. ఈసారి విద్యా సంవత్సరం జూన్‌లో ప్రారంభం కాగానే.. విద్యార్థులకు రెండుజతల స్కూల్ యూనిఫామ్స్ ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

కుట్టు కూలి ఎప్పుడిస్తారో!

గత విద్యా సంవత్సరంలో టిస్కో క్లాత్‌ను పంపిణీ చేయగా.. మండలాల వారీగా ఏజెన్సీలకు అప్పగించి విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టిచి, స్కూల్ పాయింట్‌కు పంపిణీ చేశారు. అక్కడక్కడ కొలతలు సరిగ్గా తీసుకోకపోవడం వల్ల విద్యార్థులకు సరిగ్గా సరిపోలేదు. వదులుగా, టైట్‌గా ఉండడం వల్ల కొన్ని చోట్ల విమర్శలు వినిపించాయి. అయితే ఈసారి క్లాత్ ఎంఆర్సీ సెంటర్ల నుంచి స్కూల్ పాయింట్‌కు తీసుకెళ్లాక విద్యార్థులకు దర్జీలతో కొలతలు తీసుకొని కుట్టించాల్సి ఉంటుంది. జిల్లాలకు మాత్రం కుట్టు కూలీ చెల్లించేందుకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో కొన్నేళ్లుగా ఒక్కో జతకు రూ.50 మాత్రమే చెల్లిస్తున్నారు. రెండు జతలకు కలిపి రూ.100 ఇస్తున్నారు. ఇప్పుడు స్కూల్ యూనిఫామ్‌లో కొద్దిగా మార్పులు చేశారు. పట్టీలు కూడా కుట్టాల్సి ఉంది. ఆకూలీకి దర్జీలు కుడతారా.. లేదా? అనేది వేచి చూడాలి.

మోడల్ ఛేంజ్

విద్యార్థులకిచ్చే రెండు జతల స్కూల్ యూనిఫామ్స్‌లో కలర్, కుట్టించడంలో మార్పులు చేశారు. గత విద్యాసంవత్సరంలో ఇచ్చిన స్కూల్ యూనిఫామ్‌కు భిన్నంగా ఇవి ఉండనున్నాయి. గతంలో కంటే కొంత మెరుగ్గా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకటి నుంచి మూడో తరగతి బాలికలకు ఒక రకంగా, 4 నుంచి ఐదో తరగతి వరకు మరో రకంగా 6 నుంచి 12 వరకు బాలికలకు ఇంకో రకంగా కుట్టించనున్నారు. స్కూల్ యూనిఫామ్ కలర్ ఒక్కటే అయినప్పటికీ స్టిచింగ్‌లో మార్పులు చేశారు. బాలురకు 1 నుంచి 7 వరకు ఒక రకంగా, 8 నుంచి 12వ తరగతి వరకు మరో రకంగా.. స్కూల్ యూనిఫామ్‌ను కుట్టించబోతున్నారు.

అటవీ భూములను అమ్మేస్తున్నారు..



అభివాదం చేస్తున్న సీపీఐ నేతలు



కురవికి చేరుకున్న ప్రజాపోరు యాత్ర

సీపీఐ ప్రజాపోరు యాత్రసభలో పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

నెహ్రూసెంటర్: కార్పొరేట్ కంపెనీల కోసం నూతన ఫారెస్టు చట్టం తీసుకువచ్చి అటవీ భూములను అమ్మేస్తున్నారని, విశాఖ స్టీల్, ప్రభుత్వ సంస్థలను విక్రయిస్తూ ప్రైవేటీకరణను మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నారాయణ మాట్లాడుతూ..దేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని, ప్రశ్నించే వ్యక్తులు, శక్తులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. బయ్యారంలోని ఇనుప రాయి సరైన నాణ్యత లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నోట్ల రద్దు వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, బీజేపీకి మాత్రం వేలకోట్ల రూపాయలు జమైనట్లు ఆరోపించారు. దేశంలోని పోర్టులు, విమానాశ్రయాలు, అటవీ సంపదను ఆదానీ కంపెనీలకు దోచిపెడుతున్నారన్నారు. దేశాన్ని లూటీ చేస్తున్న ఆదానీని ఎందుకు మోదీ వెనుకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీపై కోర్టు తీర్పు రాగానే అనర్హత వేటు వేయడం ఏమిటని, ఇది పార్లమెంట్‌లో ప్రశ్నించేవారు లేకుండా చేసేందుకు మోదీ చేసిన కుట్రలో భాగమేనన్నారు. 24గంటల్లోనే కోర్టు తీర్పును అమలు చేయడం వెనుక కుట్రలు దాగి ఉన్నాయని, బీజేపీకి ప్రజాకోర్టులో గుణపాఠం తప్పదన్నారు. ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే తొలగిస్తున్నారని, ప్రభుత్వం పేదల సమస్యలు పరిష్కరిస్తే ఎవరూ గుడిసెలు వేసుకోరన్నారు. రాష్ట్రంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు, నాయకులు బి.విజయసారథి, అజయ్‌సారథిరెడ్డి, జ్యోతి, రాజ్‌కుమార్, రవి, రాజారెడ్డి, భిక్షపతి, రమేష్, విశ్వేశ్వర్‌రావు, సుధాకర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కురవిలో..

కురవి:కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఆదివారం కురవి మండల కేంద్రానికి చేరుకుంది. యాత్రకు సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు కర్నం రాజన్న, పోగుల శ్రీనివాస్, తురక రమేష్, కన్నె వెంకన్న, సారయ్య, సమ్మయ్య, బుడమ వెంకన్న, బీఆర్ఎస్ మండల నాయకులు గుగులోత్ రవినాయక్, బాదావత్ రాజునాయక్, పెద్దబోయిన శ్రీశైలం స్వాగతం పలికారు. కురవి గుడి సెంటర్ వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ చేశారు. గుడి సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. రమేష్, గురువయ్య, ఉప్పలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లలో కటింగ్ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న బట్టు నాగేశ్వర్‌రావు

కేసముద్రం: కేసముద్రం మార్కెట్‌లో ఈనామ్ కింద జరిగే మిర్చి కొనుగోళ్లలో రెండు శాతం కటింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బట్టు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఏఐకేఎంఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మార్కెట్‌లో అమ్మడానికి తీసుకొస్తే వ్యాపారులు రెండు శాతం కటింగ్ చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. వ్యాపారులు, మార్కెట్ అధికారులు రైతుల నుంచి రెండుశాతం కటింగ్ చేసుకోవచ్చని, అధికారికంగా ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఈ పద్ధతిని ఎత్తివేయాలని, లేకుంటే రైతులతో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టం అంజయ్య, మదార్, హత్తిరాం, కట్టయ్య పాల్గొన్నారు.

పర్యాటకంపై పట్టింపేది?

రెండుగుట్టల నడుమ బయ్యారం పెద్దచెరువు
- చూపరులను కనువిందు చేస్తున్న అందాలు
- అమలుకు నోచుకోని మంత్రి, ప్రజాప్రతినిధుల హామీలు



నీటితో ఆహ్లాదకరంగా ఉన్న బయ్యారం పెద్దచెరువు

బయ్యారం: కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్ద చెరువుపై పాలకులు సవతితల్లి ప్రేమ చూపెడుతున్నారు. రెండుగుట్టల నడుమ ఆహ్లాదకరంగా ఉన్న బయ్యారం పెద్దచెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పలుసార్లు జిల్లా మంత్రితో పాటు పలువురు ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మారుతున్నాయి.

రెండుగుట్టలే చెరువుకట్ట..

కాకతీయరాణి బియ్యమాంబ పాలనలో రెండుగుట్టల నడుమ బయ్యారం పెద్దచెరువును నిర్మించారు. 16.2 అడుగుల నీటిసామర్థ్యంతో పెద్దచెరువు బయ్యారం, గార్ల మండలాల పరిధిలోని పలు గ్రామాల రైతులకు సాగునీటిని అందిస్తుంది. చెరువు నిర్మించిన నాటి నుంచి ఎక్కడ కరువు వచ్చిన బయ్యారం పెద్దచెరువు కింద పంటలు పండేవని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు.

కట్టపై కాకతీయుల శిలాశాసనం..


కాకతీయ వంశచరిత్ర ఆధారంగా అప్పటి కాకతీయ రాణి బియ్యమాంబ బయ్యారం పెద్దచెరువు కట్టపై శిలాశాసనం ఏర్పాటు చేశారు. ఈ శాసనంపై ఓరుగల్లును రాజధానిగా చేసుకొని పాలించిన కాకతీయ రాజుల వంశచరిత్రను వివరించారు. కాకతీయుల వంశచరిత్రను తెలిపే శాసనం బయ్యారం చెరువుకట్టపైనే ఉందని చరిత్ర తెలుపుతుంది.

అలుగుల కనువిందు..

ప్రతి వర్షాకాలంలో చెరువు నిండా నీరు చేరినప్పుడు అలుగుల నుంచి వచ్చే నీటి అందాలు చూపరులను కనువిందు చేస్తాయి. ప్రతి వర్షాకాలంలో జూన్ నుంచి ఆగస్టు వరకు వర్షాలను బట్టి చెరువులో పూర్తిస్థాయి నీరు చేరుతుంది. అలుగుల ద్వారా వచ్చే నీటి అందాలను చూసేందుకు మండలంలోని పలు గ్రామాల వాసులతో పాటు మహబూబాబాద్, కురవి, గూడూరు, గార్ల, డోర్నకల్, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు మండలానికి చెందిన పర్యాటకులు వస్తుంటారు.

అమలుకు నోచుకోని మంత్రి హామీ..

బయ్యారం పెద్ద చెరువుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని మండలంలో పర్యటించిన ప్రతిసారి జిల్లా మంత్రి సత్యవతిరాథోడ్ పేర్కొంటారు. బయ్యారం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయిస్తానని మంత్రి హామీ సైతం ఇచ్చారు. అయితే సంవత్సరాలు గడస్తున్నా మంత్రి ఇచ్చిన హామీ అమలుదిశగా అడుగులు పడకపోవడంతో స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



చెరువుకట్టపై ఉన్న కాకతీయుల శిలాశాసనం

పర్యాటకంగా మెరుగుపర్చాలి



పచ్చనిచెట్లు, కనుచూపు మేర నీటితో కనపడే బయ్యారం పెద్దచెరువు వద్దకు ప్రతి సీజన్‌లో పర్యాటకులు వస్తుంటారు. చెరువులో నీటిని నిల్వ చేసి బోటింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. చెరువు కట్ట నుంచి అలుగుల వరకు పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

- కసరబోయిన సతీష్, బయ్యారం

భద్రకాళి అమ్మవారికి పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా చారిత్రక శ్రీభద్రకాళి దేవాలయంలో ఐదవ రోజు ఆదివారం చైత్రశుద్ధ పంచమి తిథి లక్ష్మీ పంచమిని పురస్కరించుకుని పసుపు రంగు చామంతి పూలతో అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్యాహ్నికం చేపట్టారు. అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు చామంతి పూలకు సంప్రోక్షణ నిర్వహించి.. అమ్మవారికి లక్ష పుష్పార్చన చేశారు. నగరానికి చెందిన ప్రముఖ అడ్వకేట్ భాస్కర వజ్జుల పురుషోత్తం, భవాని దంపతులు దాతలుగా వ్యవహరించారు. హనుమకొండ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కృష్ణమూర్తి కుటుంబ సమేతంగా, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ శేషుభారతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



బస్సు డ్రైవర్‌ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

జనగామ: ఆర్టీసీ కార్గో బస్సు డ్రైవర్‌ నిర్లక్ష్యంతోనే తన కొడుకు మృతి చెందాడని తండ్రి కొల్లూరి ఎల్లయ్య జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌ తెలిపిన వివరాలు ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం కళ్లెంకు చెందిన కొల్లూరి దుర్గాప్రసాద్‌ ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఈ నెల 25వ తేదీ రాత్రి మృతి చెందాడు. జిల్లా కేంద్రంలో మెకానిక్‌గా పని చేస్తున్న దుర్గాప్రసాద్‌, జనగామలో నివాసముంటున్న సోదరుడు సాయి వద్దకు బైక్‌పై బయలు దేరాడు. ఈ క్రమంలో బస్సు డ్రైవర్‌ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపించి, ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌ దావీద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


దక్షిత్‌ మృతదేహం

డోర్నకల్‌: స్థానిక బైపాస్‌ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలయ్యాయి. డోర్నకల్‌ ఎస్సై శ్యాంసుందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌వీధికి చెందిన పాములపర్తి దక్షిత్‌(25) తన స్నేహితుడు కరణ్‌కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బైపాస్‌ రోడ్డు మీదుగా పెట్రోల్‌బంక్‌ వైపు వస్తుండగా ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిన దక్షిత్‌ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంకిత్‌కుమార్‌కు గాయాలయ్యాయి. మృతుడి సోదరి సునిత ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరత్నం ఆదేశానుసారం కేసు నమోదు చేసుకుని మృతదేహానికి మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం


పోలీసులు విడుదల చేసిన అనుమానితుడి ఫొటో

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో ఇటీవల గోవిందరాజుల పూజారి దబ్బగట్ల రవిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసిందే. పూజారిని హత్యచేసిన నిందితులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తును వేగిరం చేశారు. రవి కేసులో అనుమానిత నిందితుడి ఫొటోలను తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు ఆదివారం విడుదల చేశారు. ఫొటోలో ఉన్న వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించి, హత్య కేసు పరిష్కారానికి సహకరించాలని తెలిపారు. సమాచారం కోసం 87126 70112, 87126 70087, 87126 70088 నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు.

పేపర్‌ లీకేజీ కాదు.. వ్యాపారం

- పెద్దల హస్తం లేకుండా ప్రశ్నపత్రాలు ఎలా బయటకు వస్తాయి
- ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాటం
- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం


సదస్సులో మాట్లాడుతున్న ఆకునూరి మురళి


మాట్లాడుతున్న కోదండరాం

హన్మకొండ: టీఎస్‌పీఎస్సీ నుంచి ఏడెనిమిది నెలల నుంచి పేపర్లు బయటకుపోతున్నాయంటే అది లీకేజీ కాదని వ్యాపారం అని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ బచావో సదస్సులో కోదండరాం ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ పెద్దల హస్తం లేకుండా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు బయటకు రావని అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌, సభ్యులను తొలగించాలని డిమాండ్‌ చేశారు. నిరుద్యోగులు నోటిఫికేషన్లు రాకుంటే బాధపడలేదని, ప్రశ్నాపత్రాలు విక్రయాలతో భవిష్యత్‌పై వారిలో ఆందోళన నెలకొందని, విశ్వాసం కోల్పోయారన్నారు. ఆంధ్రాతోపాటు ఇతర రాష్ట్రాల్లో సోపతులు పెంచుకుని వ్యాపారాన్ని విస్తరించుకునేందుకే బీఆర్‌ఎస్‌ను స్థాపించారని ఆరోపించారు. ఇది వరకు అవినీతి మాత్రమే జరిగేదని, ఇప్పుడు అధికారం అడ్డం పెట్టుకుని అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారని కోదండరాం దుయ్యబట్టారు. వ్యాపారాల కోసం అధికారాన్ని వాడుకోవడమే రాజకీయంగా మారిందన్నారు. కేసీఆర్‌ కుటుంబం రూ.లక్షల కోట్లు సంపాదించారనే ప్రచారం జరుగుతోంది. ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఏకోన్ముఖ పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఉద్యమకారులుగా కావాల్సిన సిద్ధాంతాన్ని, కార్యాచరణను తయారు చేసి, ప్రజల ముందుంచుదామన్నారు.

కేసీఆర్‌నుంచి విముక్తి కలిగించాలి

తెలంగాణను విధ్వంసం చేసేందుకు కేసీఆర్‌ కంకణం కట్టుకున్నారని, కేసీఆర్‌ నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాలని సోషల్‌ డెమోక్రటిక్‌ ఫోరం వ్యవస్థాపకుడు, రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి ఆకునూరి మురళి అన్నారు. పేదల ఇళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు.

ఓట్లు కొని అధికారంలోకి వచ్చి దోచుకుంటున్నారు..



డబ్బులు ఇస్తేనే ఓట్లు వేస్తామని అడిగే వరకు పాలకులు ఓటర్లను తీసుకొచ్చారని ఇది అత్యంత దయనీయమైన పరిస్థితి అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారిణి విమలక్క ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులతో ఓట్లు కొని అధికారంలోకి వచ్చి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యమకారుడు సంగం రెడ్డి పృథ్వీరాజు మాట్లాడుతూ.. డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లలో రూ.కోట్లలో అవినీతి జరిగిందని, ఒక్కో ఇళ్లను రూ.3 లక్షలకు అమ్ముకున్నారని, అందుకే పేదలకు పంచడం లేదని ఆరోపించారు. ప్రొఫెసర్‌ కూరపాటి వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తిరునహరి శేషు, డాక్టర్‌ జగదీష్‌, అంబటి శ్రీనివాస్‌, బొమ్మినేని పాపిరెడ్డి, రావుల జగదీష్‌ప్రసాద్‌, వేణుస్వామి, సోమ రామ్మూర్తి పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్‌ విద్యార్థులకు అవకాశం

- సెమిస్టర్‌తోపాటు, ఇయర్‌వైజ్‌ విద్యార్థులకు కూడా..



కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల్లో గతంలో డిగ్రీ, పీజీ కోర్సులు చేసిన విద్యార్థులకు బ్యాక్‌లాగ్‌ సబ్జెక్టులు ఉంటే వారు ఆయా సబ్జెక్టుల పరీక్షలు రాసుకునేందుకు చివరి అవకాశం కల్పిస్తూ కేయూ రిజిస్ట్రార్‌ ఉత్తర్వులు జారీచేశారు. ప్రొఫెషనల్‌, నాన్‌ ప్రొఫెషనల్స్‌ కోర్సులు, సెమిస్టర్‌ సిస్టమ్‌, ఇయర్‌ వైజ్‌స్కీం విద్యార్థులకు ప్రాక్టికల్స్‌, సెమినార్లు తదితర ఏ పరీక్షల్లోనైనా బ్యాక్‌ లాగ్స్‌ ఉన్నవారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 2022–2023, 2023–2024 విద్యాసంవత్సరాల్లో జరిగే ఆయా పరీక్షలకు బ్యాక్‌ లాగ్‌ సబ్జెక్టులకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. అయితే యూనివర్సిటీలో సంబంధిత అధికారులవద్ద ఆయా విద్యార్థులు వ్యక్తిగతంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని యూజీ, పీజీ, నాన్‌ ప్రొఫెషనల్‌ కోర్సుల విద్యార్థులకు ఒక సెమిస్టర్‌కు రూ.2,000 ప్రాసెసింగ్‌ ఫీజు, రూ.3,000 చొప్పున ఒక పేపర్‌కు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అన్ని యూజీ, పీజీ కోర్సులు నాన్‌ ప్రొఫెషనల్స్‌ కోర్సులకు ఇయర్‌ వైజ్‌స్కీం విద్యార్థులకు ప్రాసెసింగ్‌ ఫీజు రూ.3,000, రూ.4,000 చొప్పున ఒక పేపర్‌కు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అన్ని యూజీ, పీజీ కోర్సులు ప్రొఫెషనల్‌ కోర్సులకు ప్రాసెసింగ్‌ ఫీజు ఒక సెమిస్టర్‌కు రూ.3,000, రూ.5,000 ఒక పేపర్‌కు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని రిజిస్ట్రార్‌ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య


గుడ్ల వెంకన్న(ఫైల్‌)

కేసముద్రం: మానసికస్థితి సరిగాలేని ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని కాట్రపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గుడ్ల వెంకన్న(53) వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా అతడి మానసికస్థితి సరిగ్గా ఉండటంలేదు. ఈక్రమంలో తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వెంకన్న తిరిగి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించగా, చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి..

కాశిబుగ్గ: ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్‌, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య సంతోషిమాత గుడి సమీపంలోని రైల్వేట్రాక్‌పై చోటు చేసుకుంది. వరంగల్‌ జీఆర్‌పీ సీఐ నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50–55 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి కాజీపేట వరంగల్‌ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడు బ్లాక్‌ అండ్‌ వైట్‌ షేడ్స్‌ జీన్స్‌ ప్యాంట్‌, వైట్‌ కలర్‌ టీ షర్ట్‌ ధరించి తెల్లని, నల్లని తల వెంట్రుకలు, తెల్లని గడ్డంతో ఎత్తు 5.5 ఉన్నాడని తెలిపారు. చామన ఛాయా, గుండ్రని ముఖం, ఛాతిపై పుట్టుమచ్చ ఉందన్నారు. చనిపోయిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు, గుర్తింపు కార్డులు లేనందున మృతదేహాన్ని వరంగల్‌ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చామని వివరాలు తెలిస్తే 94403 61941, 94406 27532 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి..

గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలికి చెందిన వ్యవసాయ కూలీ మొగసాని వీరస్వామి(53) గత కొంత కాలంగా గొంతు కేన్సర్‌ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊకల్‌హవేలికి చెందిన వీరస్వామి వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 21న క్రిమిసంహారక మందు తాగగా.. చికిత్స నిమిత్తం వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈనేపథ్యంలో అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు స్థానిక సర్పంచ్‌ మొగసాని నాగదేవతకు మామ కావడంతో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్‌, గోలి రాజయ్య, ముంత రాజయ్య, పలువురు సర్పంచ్‌లు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పెట్టుబడిదారుల చేతికి వ్యవసాయరంగం

- ఏఐకేఎంఎస్‌ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య
- నర్సంపేటలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ఐదో మహాసభలు


మహాసభలో మాట్లాడుతున్న ఐలయ్య

నర్సంపేట: దేశ వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ పెట్టుబడిదారులకు అప్పగించి చేతులు దులుపుకున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్‌) రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. ఈ మేరకు అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఐదో మహాసభలు ఆదివారం నర్సంపేట పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు ఆబర్ల రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అజమాయిషీ లేదని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించి ఎనిమిది సంవత్సరాలు అవుతుందని, కానీ, రైతుల అప్పులు మాత్రమే రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం 12వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి అమలు చేయడంలో విఫలం చెందిందని ఆరోపించారు. ఇటీవల తుఫాను వల్ల రైతులు కోట్ల రూపాయలు నష్టపోతే కేసీఆర్‌ నామమాత్రంగా నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకున్నాడని విమర్శించారు. దీనికి రాష్ట్ర సీపీఐ, సీపీఎం పార్టీలు వత్తాసు పలకడం నాలుగు సీట్ల కోసం వెంట తిరగడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్‌ కమిషన్‌ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్‌ జగదీశ్వర్‌ మాట్లాడుతూ.. సమాజంలో ఉండే కులమత అంతరాలకు వ్యతిరేకంగా పని చేయాలన్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్‌ జిల్లా నూతన కార్యవర్గాన్ని మహాసభ ప్రతినిధులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆబర్ల రాజన్న, ప్రధాన కార్యదర్శిగా మొగిలి ప్రతాప్‌రెడ్డితో పాటు 11మంది సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో విప్లవ రైతాంగ ఉద్యమంలో రాష్ట్ర నాయకురాలిగా పని చేసి ఇటీవల మృతి చెందిన బేబక్క, ఇతర అమవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ మహాసభకు ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్‌, సంఘ నాయకులు రాచర్ల బాలరాజు, జిల్లా నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, బోగి సారంగపాణి, బొమ్మడి సాంబయ్య, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రేలకుంటలో గొర్రెల చోరీ

నల్లబెల్లి: వరంగల్‌ జిల్లా నల్లబెల్లి మండలంలోని రేలకుంటలో గొర్రెల చోరీ విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాలకు చెందిన చిట్టి రవి, అమ్మ కుమార్‌, చిట్టి కొంరయ్య, బాలు నాయక్‌లు గొర్రెలను పెంచుతూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, ఉగాది రోజున రేలకుంట శివారులో వారు మంద ఏర్పాటు చేసుకుని రాత్రి సమయంలో నిద్రపోయారు. ఈ క్రమంలో సమీప మొక్కజొన్న చేనులో కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తూ మాటుగాచారు. గొర్రెల కాపరులు ఉన్నవారు నిద్రమత్తులో ఉండగా అదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు మందలోకి చొరబడి 8 గొర్రెలను ఎత్తుకుపోయారు. ఈ మేరకు బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్‌ నాయక్‌ తెలిపారు.

పెండింగ్‌ బిల్లులు చెల్లించాలి

విద్యారణ్యపురి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌ బిల్లులు విడుదల చేయాలని డెమోక్రటిక్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ (డీటీఎఫ్‌) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌, సుదర్శనం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు ఈనెల 28న హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని తెలిపారు. వివిధ రకాల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ–కుబేర్‌లో ఉన్న బిల్లులను ఈనెల 31వరకు విడుదల చేయాలని తెలిపారు.

కేసీఆర్‌ నిరంకుశ విధానాలను అడ్డుకుందాం

- పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల కన్వీనర్‌ గురువారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గురువారెడ్డి

ఖిలా వరంగల్‌ : మోదీ మతోన్మాద ఫాసిజాన్ని కేసీఆర్‌ నిరంకుశ విధానాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్‌ ఆర్‌. గురువారెడ్డి కోరారు. ఆదివారం ఖిలా వరంగల్‌ ఫోర్ట్‌రోడ్‌లోని అన్నపూర్ణ కల్యాణమండపంలో తీగల జీవన్‌గౌడ్‌ అధ్యక్షతన నిర్వహించిన పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్‌ జిల్లా పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిజాన్ని రాష్ట్రంలో కేసీఆర్‌ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను ప్రగతిశీల శక్తులంతా ఐక్యంగా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బండి కోటేశ్వర్‌, తీగల జీవన్‌గౌడ్‌, నలిగంటి చంద్రమౌళి, స్వామి, కొత్తపల్లి రవి, సాగర్‌ ముంజాల భిక్షపతి, గద్దల డానియల్‌, బెల కుమారస్వామి పాల్గొన్నారు.

సిరుల పంట కీర దోస..

- రెండు నెలలకే చేతికి..
- ఏడాదిలో నాలుగుసార్లు సాగు చేసుకునే అవకాశం
- దామెరలో 15 ఎకరాల్లో సాగు
- ఆసక్తి చూపుతున్న రైతులు


కీరదోసను కోస్తున్న కూలీలు

ఎల్కతుర్తి: భూమిని నమ్ముకున్న రైతులు ఆ భూమిలో ఏ పంట వేస్తే బాగుంటుందో ఆలోచించాలి. అలా నూతనంగా ఆలోచించిన రైతులకు భూమి సిరుల పంటలను కురిపిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఇదే కోవలో కీరదోస పంట రైతుల పాలిట వరప్రదాయనిగా మారుతుంది. మునుపెన్నడూ లేని విధంగా రైతులు కాస్త తమ పంటల పద్ధతిని మార్చి కొత్త పంటల వైపు అడుగులు వేస్తున్నారు. ఆదాయ వనరుగా మారిన కీరదోస పంట సాగుపై ప్రత్యేక కథనం..

రెండు నెలల పంట


సంచుల్లో నింపిన కీరదోస

కీరదోస కేవలం రెండు నెలల పంట. రెండు నెలల్లోపే కీరదోసలు మార్కెట్‌కు తరలించేంతగా ఎదుగుతాయి. తక్కువ నీటిని వినియోగించుకుని ఎక్కువ లాభాలను ఇచ్చే పంటగా కీరదోస రైతులను ఆకర్షిస్తోంది. రోహిణి కార్తె మొదలు నుంచి ఈ పంటను సాగు చేస్తారు. మరుసటి ఏడాది ఫిబ్రవరి, మార్చితో పంట కాలం ముగుస్తుంది. నీటి సౌకర్యాన్ని బట్టి పంట ఎదుగుదల ఉంటుంది. పంట సాగు కోసం పెద్దగా శ్రమపడాల్సిన పని ఉండదు. విత్తనాలు వేసినప్పటి నుంచి మొక్కలు మొలకెత్తి తీగ పారేంత వరకు పురుగు మందుల వాడకం చాలా తక్కువగా ఉంటుంది. ఎకరాకు సుమారు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రోజు తప్పి రోజు కాయలను కోసుకోవచ్చు. కాయల సైజు ప్రకారం ధరలు ఉంటాయి. 15ఎంఎం ధర రూ.24, 20ఎంఎం రూ.12, 30ఎంఎంకు రూ.5 చొప్పున ధర చెల్లిస్తారు. కాయ సైజు పెరిగితే ధర తక్కువగా ఉంటుంది. కాయలు మొదలైనప్పటి నుంచి సుమారు 15 నుంచి 20 సార్లు కోత కోసుకోవచ్చు.

దామెరలో 15 ఎకరాల్లో సాగు

మండలంలోని దామెర గ్రామంలో సుమారు 8మంది రైతులు 15 ఎకరాల్లో ఈ ఏడాది కీరదోస పంటను సాగు చేశారు. వీరంతా ఇంతకు ముందు వరి, మొక్కజొన్న, మిరప పంటలను సాగు చేసే రైతులు. ఈ ఏడాది వీరు తమ పంటలో మార్పు చేయాలని ఆలోచించి కీరదోస పంట గురించి తెలుసుకున్నారు. అందులో ఉన్న లాభనష్టాలను బేరీజు వేసుకుని కీరదోస పంటను వేశారు. రెండు నెలల్లోనే ఆదాయం చూపించే కీరదోస పంటకు ఇక్కడి చౌక భూములు అనుకూలంగా ఉండడంతో రైతులు వేసిన పంటలు ఆశించిన స్థాయిలో ఎదిగాయి. ప్రస్తుతం నీటి వసతులు సరిపడా ఉండడంతో పంట రెండు నెలల్లోనే చేతికొచ్చేసింది. పంట వేసిన 30 రోజుల్లో కాత వస్తుంది. మరో 30 రోజులు కాయలను కోసుకునేందుకు వీలు ఉంటుంది.

కంపెనీదే బాధ్యత

దామెరలో కీరదోస విత్తనాలను గ్రీన్‌గ్లోబల్‌ జహీరాబాద్‌ అనే కంపెనీ వారు అందించారు. విత్తనాలు వేసినప్పటి నుంచి కాయలను తరలించేంత వరకు వారిదే బాధ్యత ఉంటుంది. రైతు కేవలం పంట బాగోగులు, నీళ్లు పెట్టడం, కూలీ ఖర్చులు చూసుకోవాల్సి ఉంటుంది. ఏవైనా చీడపీడలు సోకితే నివారణ చర్యలకు కంపెనీ సూచనలు, సలహాలను అందిస్తుంది. ముందుగా కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం పంట దిగుబడిని లెక్కకట్టి డబ్బులు రైతులకు అందిస్తారు. రెండు నెలల్లో పంట కోసం పడిన శ్రమకు ఫలితం దక్కుతుందని రైతులు చెబుతున్నారు. ఇలా తరలించిన కీరదోస కాయలను ఇతర రాష్ట్రాకు ఎగుమతి చేస్తారు. ఆరోగ్య ప్రదాయినిగా నిలిచే ఈ కాయలు తినేందుకు, మందుల తయారీకి ఉపయోగపడుతాయని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ కాయలను రైతుల వద్ద నుంచి జహీరాబాద్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి యూఎస్‌ఏ, గల్ఫ్‌ దేశాలకు ఎగుమతి చేస్తారు.

ఆకర్షితులవుతున్న రైతులు

తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడిని ఇచ్చే కీరదోస పంటలపై రైతులు ఇప్పుడిప్పుడు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో వల్భాపూర్‌లో మొదలైన ఈ పంట మండలంలోని దామెర, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌, వంగర, రంగయ్యపల్లి, ధర్మారం, ఎర్రబెల్లి తదితర గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్నారు. ఎలాంటి రిస్కు లేకపోవడంతో ఈ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

శ్రమ తక్కువ -ఆదాయం ఎక్కువ



కీరదోస పంట సాగులో శ్రమ, చీడపీడల బెడద తక్కువ. రెండు నెలల్లోనే ఆదాయం కనిపిస్తుంది. తోటి రైతులు సాగు గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఈ పంటలో ఇప్పటి వరకు నష్టం లేదు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు తీగ తెగిపోయి కొంతమేర నష్టం వాటిల్లింది.

– విజయ మహిళా రైతు, దామెర

నీటి వినియోగం తక్కువ




నేను కీరదోస పంటను ఎకరంలో సాగు చేశాను. ఒక ఎకరానికి సరిపడే నీళ్లతో మూడెకరాలకు పారించుకోవచ్చు. దోస తీగలను రక్షించుకుంటే పంట చేతికందినట్టే. ఏడాదిలో నాలుగు సార్లు ఈ పంటను సాగుచేసుకోవచ్చు. నేను ఐదు ఏళ్ల నుంచి సాగుచేస్తున్నాను. 50వేలు విత్తనాల ఖర్చుపోగా సంవత్సరానికి రూ.70వేలు ఆదాయం సమకూరుతుంది.

– ఎడ్ల రవీందర్‌రెడ్డి రైతు, దామెర

ఇంకా లభ్యంకాని హర్షిత్‌ మృతదేహం

- నాలుగు రోజులుగా గాలింపు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌

హసన్‌పర్తి: నాలుగు రోజుల క్రితం ఎస్సారెస్పీ కాల్వలో గల్లంతైన గుండ్లసింగారం పలివేల్పులకు చెందిన మట్టెడ హర్షిత్‌ మృతదేహం నేటికీ లభ్యం కాలేదు. మృతదేహం కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. మధ్యలో ఎక్కడైనా మృతదేహం చిక్కిందా.. నీటి ప్రవాహానికి పక్క కొట్టుకుని పోయిందా.. అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పక్క జిల్లాల పోలీసులకు కూడా సమాచారాన్ని అధికారులు సమచారం చేరవేశారు. ఈ ఘటనలో గల్లంతైన అన్విక్‌ మృతదేహం రెండు రోజుల క్రితమే లభ్యం కాగా, కుంటు సభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, కాల్వలో గల్లంతైన అన్విక్‌, హర్షిత్‌ కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన జుబేదా బేగం కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్‌ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, గనిపాక విజయ్‌కుమార్‌, జాగృతి జిల్లా అధ్యక్షుడు సుమన్‌, మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు ఖాదర్‌బాబా ఉన్నారు.